క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కాంస్య విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్ : ప్రపంచంలోనే ఎత్తైన 150 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వర కాంస్య విగ్రహం ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. స్థానిక ఆలూరు రోడ్డులోని భీమా ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పది ఎకరాల సొంత భూమిలో ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్‌రెడ్డి భూమిపూజ చేశారు. కాంస్య విగ్రహం కోసం ఎమ్మెల్యే పది ఎకరాలు కేటాయించారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



కడపాళెం వీధిలో వృద్ధురాలి బీపీని పరీక్షిస్తున్న ఏఎన్ఎం సుజాత

కోసిగి: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటి వద్దకే వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నామని ఏఎన్ఎం సుజాత తెలిపారు. గురువారం స్థానిక కడపాళెం వీధిలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వివరాలు నమోదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త వెంకటమ్మ, ఆశా వర్కర్ లక్ష్మి ఉన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్ : పట్టణంలోని ఆర్టీసీ కాలనీ సచివాలయం–2 పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ఆరు అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయని, అక్టోబర్ నుంచి ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఒకరోజు క్యాంపెయిన్‌డేగా నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌కు అక్టోబర్ 5న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలోనున్న సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించిన సర్వే జరుగుతుందన్నారు. మెడికల్ ఆఫీసర రవళియాదవ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, ఇందిరానగర్ ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

మంత్రాలయం: మండలంలోని తుంగభద్ర గ్రామంలో వెలసిన శ్రీ రాఘవేంద్రస్వామి, 52 బసాపురం గ్రామంలో వెలసిన సాయిబాబా, కాచాపురం గ్రామంలో దస్తగిరియ్య దర్గా వద్ద ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, దర్గా పెద్దలు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంత్రాలయం: ఈనెల 16న మండల కేంద్రంలో నిర్వహించిన అండర్–17 కబడ్డీ పోటీల్లో రచ్చుమర్రి మోడల్ స్కూల్ విద్యార్థులు మంత్రాలయం జట్టుపై విజయం సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రసాద్, సిబ్బంది గురువారం అభినందించారు.

పండ్ల తోటల పెంపకం, సంరక్షణపై శిక్షణ

పెద్దకడబూరు : ఈ నెల 23వ తేదీన పండ్ల తోటల పెంపకం, వాటి సంరక్షణపై రైతులకు శిక్షణ ఉంటుందని ఏపీఓ రామన్న తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 2023 – 24 సంవత్సరానికి మండలంలో 101 మంది రైతులకు 135 ఎకరాలలో పండ్ల తోటలు పెంపకంలో భాగంగా టెంకాయ, మామిడి, నిమ్మ, నల్లరేగు, సీతాఫలం, మునగ, మల్లెపూల చెట్లును ఉచితంగా అందజేశామని చెప్పారు. వాటికి రెండు సంవత్సరాల పాటు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందుతాయనే అంశంపై హార్టికల్చర్ జిల్లా అధికారులతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కలు నాటుకున్న ప్రతిరైతు శిక్షణకు హాజరు కావాలని కోరారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఆదోనిరూరల్ : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. పట్టణ నాయకులు మణికంఠ, మనోహన్, చిన్నా, కుమార్, రామంజి, మధు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసేంతవరకు ఉద్యమాలు చేపడుతూనే ఉంటామన్నారు. యేసన్న, సత్తిబాబు, బసయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు బుధవారం నుంచి హోరాహోరీగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లో చదువుతున్న 14 –17 సంవత్సరాల మధ్యనున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 30 బాలికల జట్లు పాల్గొన్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. 8 జట్లు కబడ్డీ,త్రోబాల్,ఖోఖో వంటిపోటీల్లో గెలుపొందాయి.

ప్రతిభ చాటిన బాలికల జట్లు..

అండర్–14 కబడ్డీలో పెద్దహరివాణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల జట్టు విన్నర్, దొడ్డనగేరి ఉన్నత పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. అండర్–17 కబడ్డీ పోటీల్లో పెద్దహరివాణం విన్నర్, ఆరెకల్లు అంబేడ్కర్ రెసిడెన్సియల్ పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో అండర్–14లో ధణాపురం ఉన్నత పాఠశాల విన్నర్, ఆరెకల్లు ఏపీజేఎస్ పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. అండర్–17లో ఆరెకల్లు ఏపీజేఎస్ విన్నర్, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల రన్నర్‌గా, త్రోబాల్ అండర్–14 నేషనల్ పాఠశాల విన్నర్, కిడ్డీస్ పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. అండర్–17లో మదిరె విన్నర్, ఆరెకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రన్నర్‌గా, దొడ్డనగేరి, పెద్దతుంబళం వంటి పాఠశాలలు వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందారు.



కబడ్డీ ఆడుతున్న పెద్దహరివాణం బాలికల జట్టు



త్రోబాల్‌లో ప్రతిభ చాటిన ఆరెకల్లు విద్యార్థినులు

సంతోషంగా ఉంది



క్రీడా పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. గతంలో రోటరీ క్లబ్ నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాం. అప్పుడు కూడా కబడ్డీ పోటీల్లో విజయం సాధించాం. కబడ్డీ పోటీల్లో మా పాఠశాల అండర్–14, 17 విభాగాల్లో గెలుపొందడం ఆనందంగా ఉంది. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటాలని ఉంది. వ్యాయమ ఉపాధ్యాయులు బాగా ప్రోత్సహిస్తున్నారు. – ఎ.వాణి, బిపి.పవిత్ర విద్యార్థినులు పెద్దహరివాణం

ఆటలంటే చాలా ఇష్టం



ఆటలంటే చాలా ఇష్టం. మా నాన్న వ్యాయమ ఉపాధ్యాయుడు..దీంతో ఆటలపై మక్కువ పెరిగింది. బాలికల జట్టుకు కెప్టెన్‌గా ఉంటూ అండర్–14 త్రోబాల్ పోటీల్లో విన్నర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని ఉంది. – జి. నిహారిక నేషనల్ పాఠశాల ఆదోని

క్రీడలతో మానసికోల్లాసం



చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా అవసరం. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో మానసికోల్లాసం కలుగుతుంది. అలాగే వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నియోజకవర్గంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు 40 ఉండగా అందులో 38 పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థిని, విద్యార్థులకు క్రీడలపై ఆశక్తిని పెంచడానికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయి. – నరసయ్య, పీడీ, ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్

నాణ్యమైన భోజనం అందించాలి



కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ–2 నాగేశప్ప

కోసిగి: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ–2 నాగేశప్ప సూచించారు. గురువారం కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. 10వ తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని చెప్పారు.

భయాందోళనకు గురికావద్దు

ఆదోని సెంట్రల్: మండలంలోని నెట్టెకల్లు గ్రామ ప్రజలు భయాందోళనకు గురికావద్దని ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజశ్వని తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొందరు గ్రామస్తులు పొలాల నుంచి వస్తుండగా గ్రామ శివారు కొండల్లో చిరుతను చూ శామని చెప్పడంతో ఆందోళన గురయ్యారన్నా రు. ఫారెస్టు బీట్ అధికారులు గ్రామనికి వెళ్లి స్థానికులతో మాట్లాడారని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. చిరుత సంచారం గురించి తెలిస్తే సమాచారం ఇవ్వవాలని కోరారు.

తిక్కారెడ్డి.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు



మాట్లాడుతున్న సి.వి.విశ్వనాథ్‌రెడ్డి

మంత్రాలయం: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వ్యవసాయసలహా మండలి అధ్యక్షుడు సి.వి.విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నీ చర్యల కారణంగా ఇప్పటికే ప్రజలు నిన్ను దూరం పెడుతున్నారని, వచ్చే ఎన్నికల్లోనూ అదే తీర్పు పునరావృతమవడం ఖాయమన్నారు. అన్నదాతల కడుపు కొట్టేలా నాడు.. నీవు ఏర్పాటు చేసుకున్న తూము వద్ద ప్రదీప్ రెడ్డి ధర్నా చేసిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గురించి మాట్లాడేముందు నీ చరిత్ర గుర్తు చేసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో.. ఎమ్మెల్యే కాకపోయినా నీరు–చెట్టు, జన్మభూమి కమిటీల పేరుతో పథకాల్లో పర్సెంటేజీలు తీసుకున్నది వాస్తవం కాదా అని నిలదీశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నందునే మూడు సార్లు గెలిపించారని, వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ వై.గిరిజమ్మ

మంత్రాలయం: ఈనెల 30వ తేదీ నుంచి చేపట్టబోయే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వై.గిరిజమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందుకు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సి.వి.విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మణిమంజరి, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య పాల్గొన్నారు. ముందుగా తమ శాఖల ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. కల్లుదేవకుంట పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండటమే కాకుండా నెలకు 20 చొప్పున కాన్పులు చేస్తున్నారని, గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించి సంక్షేమ పథకాలను పొందాలని కోరారు. ఆస్పత్రికి తాగునీటి పైపులైన్, విధీదీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ప్రభుత్వ భవనాలు, జగనన్న కాలనీల్లో పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని లబ్ధిదారులకు కుడా సకాలంలో బిల్లులు మంజూరు అవుతున్నాయన్నారు. త్వరలోనే రూ 60 లక్షలతో గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కారిస్తామని చెప్పారు. రేషన్ పంపిణీ వాహనాలు సక్రమంగా ఇళ్లకు వెళ్లడం లేదని వెంటనే ఇంటి వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేసేలా చూడాలని రెవెన్యూ అధికారులను సూచించారు. సూగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శ్మశాన వాటిక స్థలంలో కడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా.. గ్రామస్తుల అభిప్రాయం మేరకు పనులు చేపట్టారని, ఏదైనా ఉంటే పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య విషయాలను వలంటీర్లు తెలుసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. గురువారం మండలంలోని హాల్వి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి పనితీరును తెలుసుకున్నారు. అనంతరం కుంబళనూరు గ్రామంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న గడప గడపకు మన కార్యక్రమం, జగనన్న ఆరోగ్య సురక్షపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి జగనన్న సురక్షలో నమోదు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో కుంబళనూరు సర్పంచ్ వీరేష్, అనిల్‌కుమార్, బుచ్చిరాయుడు, చక్రవర్తి, ఈరన్నగౌడ్ పాల్గొన్నారు.

అన్నదానం

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని 35వ వార్డు పంజరాపోల్ వీధిలో వెలిసిన అభయాంజనేయ వినాయక మిత్రమండలి సభ్యుల ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ పాల్గొన్నారు. కురువ రవి, అగ్గి రాముడు, అబ్రహాం, భరత్, వేణు, లక్ష్మన్న, ప్రసాద్, వీరేష్, రాము, వీరేంద్ర, అశోక్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోనిఅర్బన్ : ఆస్పరి మండలం బల్లేకల్ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు నాగేష్‌పై దాడి చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు రాజు, సుదర్శన్ కోరారు. గురువారం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగేష్‌ను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ బుధవారం రాత్రి బల్లేకల్‌లో గణేష్ నిమజ్జనోత్సవం జరుగుతుండగా సీపీఐ నాయకుడు నాగేష్ ఇంటి వద్ద టీడీపీ నాయకులు గొడవ పడుతుండగా ప్రశ్నించినందుకు టీడీపీ నాయకులు ఆయనపై దాడి చేశారన్నారు. వీరేష్, నాగరాజుతో పాటు మరో ఆరుగురు దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధులు విడుదల చేయాలి

కోసిగి: ఎస్సీ, ఎస్టీలకు నిధులు విడుదల చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఓంకార్ స్వామి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

త్వరలో అందుబాటులోకి క్లీనింగ్ అండ్ గ్రేడింగ్ మిషన్



క్లీనింగ్ అండ్ గ్రేడింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న రామాంజనేయులు

ఆదోనిఅర్బన్ : మార్కెట్‌యార్డులో త్వరలో క్లీనింగ్ అండ్ గ్రేడింగ్ మిషన్ అందుబాటులోకి రానుందని, రైతులు తమ ధాన్యాన్ని క్లీనింగ్ అండ్ గ్రేడింగ్ చేసుకొని మంచి ధర పొందాలని కడప వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో త్వరలో ప్రారంభంకానున్న క్లీనింగ్ అండ్ గ్రేడింగ్ మిషన్‌ను పరిశీలించి ట్రయల్ చేసి చూశారు. ఆయన మాట్లాడుతూ.. శనగలు, పెసలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పొలాల్లో పోసిన ధాన్యాలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేని వాటిని ఈ మిషన్‌లో వేస్తే శుభ్రం కావడంతో గ్రేడింగ్ అయ్యి మంచి ధర లభిస్తుందన్నారు. కొంతమంది రైతులు పొలాల్లో పోసిన పంటను నేరుగా మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్మకానికి పెట్టడంతో ధర తక్కువగా వస్తుందని, వారు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ మిషన్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ మిషన్ గంటకు మూడు టన్నుల ధాన్యాన్ని శుభ్రం చేయగలదన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఆదోనిలో నేడు గణేష్ నిమజ్జనం

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- 600 మంది పోలీసులతో బందోబస్తు



ఎల్‌బీ స్ట్రీట్‌లో ఛత్రపతి శివాజీగా..



భీరప్పనగర్‌లో శివుడికి పూజ చేస్తున్న భారీ మట్టి గణపతి

ఆదోనిఅర్బన్: వినాయక చవితి సందర్భంగా మండపాల్లో నెలకొల్పిన బొజ్జ గణపయ్యకు వీడ్కోలు పలికేందుకు ఆదోని పట్టణ ప్రజలు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం నిమజ్జనోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో 500కు పైగా గణనాథులు కొలువుదీరారు. ఏయే గణపతి ఏ రూట్‌లో వెళ్లాలో ప్రతిఒక్క మండప నిర్వాహకులకు ముందుగానే పోలీసు అధికారులు సూచనలు చేశారు. రూట్ మ్యాప్ ప్రకారంగా చిన్నహరివాణం, బసాపురం కాలువలో గణేష్ నిమజ్జనోత్సవం జరపాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూట్ మ్యాప్ చేపట్టారు. ఉదయం 9 గంటలకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూ, హుండీలకు వేలం పాట ప్రకటించి, అనంతరం ప్రధాన రహదారుల్లో ఊరేగింపు చేసి చిన్నహరివాణం కాలువ వద్దకు తీసుకెళ్తారు. అక్కడ ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి వీహెచ్‌పీ సభ్యులు నిమజ్జనోత్సవాన్ని ప్రారంభిస్తారు. ఎస్పీ క్రిష్ణకాంత్ ఆధ్వర్యంలో 600 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఒకరు అడిషనల్ ఎస్పీ, పది మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 300 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, వంద మంది హోంగార్డులు, మూడు స్పెషల్ పోలీస్ సిబ్బంది, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, పాల్కన్ వాహనం ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ విలేకరులకు తెలిపారు.


సంఘసంస్కర్త గురజాడ అప్పారావు



గురజాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: సాంఘిక దురాచారాలను ఎండగడుతూ సమాజాన్ని చైతన్య పరిచిన సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ తెలిపారు. గురువారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలీం సిద్దీఖీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అరసం కార్యవర్గ సభ్యులు ఎన్.సుధాకర్, సీనియర్ ఉపాధ్యాయులు రామయ్య, మార య్య, విజయ్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

సోమన్నకు గురజాడ స్ఫూర్తిరత్న అవార్డు



గద్వాల సోమన్నను సత్కరిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాల్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహితీవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను గురజాడ స్ఫూర్తిరత్న అవార్డు వరించింది. అనతి కాలంలోనే 42 పుస్తకాలను రచించి తెలుగు భాషలో విశేష కృషి చేసినందుకు గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా గురువారం అవార్డును అందజేశారు. గద్వాల సోమన్న మాట్లాడుతూ అంతర్జాతీయ గురజాడ ఫౌండేషన్ (అమెరికా) అధ్యక్షుడు, గురజాడ రవీంద్రుడు (గురజాడ మునిమనవడు), దామ రాజు శంకరం, చిన సూర్యనారాయణ..విశాఖపట్టణంలోని రామకృష్ణ పాఠశాలలో అవార్డును అందజేసి సన్మానించి పురస్కారం కింద నగదు, మెమెంటో, శాలువాతో సన్మానించారని చెప్పారు. నిర్వాహకులు పల్లి గోవిందు, ప్రసాద్, వద్రే నాంచారయ్య, నూకరాజు, కోరాడ నరసింహారావు పాల్గొన్నారు.